

మంచాల మండలంలో సాగు చేసిన కొత్తిమీర, గోంగూర పంట

## పెట్టుబడి స్వల్పం..
# రాబడి అధికం

- కూరగాయలు, ఆకుకూరల సాగులో రాణిస్తున్న మండలంలోని పలు గ్రామాల రైతులు
- ప్రతిరోజూ మార్కెట్లకు తరలించి లాభాల ఆర్జన

మంచాల, డిసెంబర్ 26 : మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు ఆరుతడి పంటలైన కూరగాయలు, ఆకుకూరలను సాగుచేస్తూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. జాపాల, అస్మత్‌పూర్, ఆరుట్ల, మంచాల, చెన్నారెడ్డిగూడ తదితర గ్రామాల్లోని చిన్న, సన్నకారు రైతులు తమకున్న కొద్దిపాటి భూముల్లో వరికి బదులుగా కొత్తిమీర, పుదీనా, పాలకూర, కొయ్యికూర, గోంగూర, తోటకూర, టమాట, బెండ, చిక్కుడు, బీరకాయ వంటి పంటలను సాగుచేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజల జీవనాధారం వ్యవసాయమే. తక్కువ పెట్టుబడితో అన్నదాతలు తాము సాగు చేసిన ఉత్పత్తులను ఉదయమే తెంపి స్వయంగా హైదరాబాద్ నగరంలోని ఎల్‌బీనగర్, మాదన్నపేట, కొత్తపేట, బీఎన్‌రెడ్డినగర్ తదితర మార్కెట్లకు తరలించి అక్కడ విక్రయించి లాభాలను పొందుతున్నారు. కూరగాయలు, ఆకుకూరలు తాజాగా ఉండడంతో మార్కెట్లకు తరలించిన కొద్దిసేపట్లోనే అవి అమ్ముపోతుండడంతో తిరిగి తొమ్మిది గంటల వరకు ఇండ్లకు చేరుకుని మళ్లీ వ్యవసాయ పనుల్లోనే నిమగ్నమవుతున్నారు.

### ఆకుకూరల సాగులో గ్రామాలు..

మండలంలోని చాలా గ్రామాల్లోని రైతులు తమకున్న భూముల్లో ఆకుకూరలు, కూరగాయల పంటలను సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. జాపాల, అస్మత్‌పూర్ గ్రామాల్లో 150 ఎకరాల్లో ఆకుకూరలు, కూరగాయలను సాగు చేస్తున్నారు. ఆరుట్లలో 120 ఎకరాల్లో.. మంచాలలో 130 ఎకరాల్లో కూరగాయలను పండించి ప్రతిరోజూ మార్కెట్లకు అన్నదాతలే ఆటోలు, వాహనాల్లో తీసుకెళ్లి విక్రయించి లాభాలను పొందుతున్నారు. హైదరాబాద్‌కు జాపాల, అస్మత్‌పూర్ గ్రామాలు దగ్గరగా ఉండడంతో అక్కడ అమ్మి తిరిగి ఇండ్లకు తొమ్మిది నుంచి పది గంటల మధ్య వస్తున్నారు.

### తాజాగా ఉండడంతో తొందరగా అమ్ముడవుతున్నాయి..



ప్రతిరోజూ పొలంలో సాగు చేసిన వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయాలను మార్కెట్‌కు ఆటోలో తీసుకెళ్లి విక్రయిస్తా. అవి తాజాగా ఉండడంతో తీసుకెళ్లిన కొద్దిసేపట్లోనే అమ్ముడవుతున్నాయి. గోంగూర, పూదీనా, పాలకూరతో పాటు కూరగాయలను విక్రయించగా రూ. నాలు గు వేల వరకు వస్తుంది. మళ్లీ ఇంటికి వచ్చి వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతా.

-రావుల మల్లమ్మ (ఆరుట్ల)



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఆకుకూరలు

### ఆరుతడి పంటలను సాగు చేయాలి



యాసంగి సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలి. వరికి బదులుగా ఆరుతడి పంటలైన ఆకుకూరలతోపాటు టమాట, చిక్కుడు, సోరకాయ వంటి పంటలను సాగు చేసుకుంటే మంచి దిగుబడి వస్తుంది. పంటలకు చీడ పురుగులు సోకితే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి తగు నివారణ చర్యలు తీసుకోవాలి.

- జ్యోతిశ్రీ, వ్యవసాయశాఖ అధికారిణి

షాద్‌నగర్‌టౌన్‌లోని రోడ్డును కమ్మేసిన దట్టమైన పొగమంచు



- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను కప్పేసిన మంచు దుప్పటి
- ఉదయం తొమ్మిది గంటలైనా తొలగని మంచు తెరలు
- రోడ్లపై లైట్లు వేసుకుని వెళ్లిన వాహనదారులు
- ఇబ్బందులు ఎదుర్కొన్న జనం

## ముంచెత్తిన
# మంచు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను మంచు ముంచెత్తున్నది. గత కొన్ని రోజులుగా దట్టమైన పొగమంచు కురుస్తుండడంతో ఉదయం సమయంలో మనుషులు, రోడ్లు సైతం కనిపించడంలేదు. ఉదయం తొమ్మిది గంటల వరకు కూడా పొగమంచు కమ్మేస్తున్నది. పొగమంచులో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారితోపాటు ఉమ్మడి జిల్లాలోని పలు రోడ్లపై వెళ్లే వాహనాల డ్రైవర్లు ఎదురుగా ఏమి కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. మరికొందరు తమ వాహనాలను రోడ్డు పక్కన నిలుపుకొని మంచు పూర్తిగా తగ్గిన తర్వాత వెళ్తున్నారు. పొగమంచులో భానుడు చంద్రుడిలా కనిపిస్తున్నాడు. ఉదయం, సాయంత్రం సమయాల్లో చల్ల గాలులు వణికిస్తుండడంతో ప్రజలు బయటికి వచ్చేందుకు జంకుతున్నారు. గ్రామాల్లోని ప్రజలు చలిని తట్టుకునేందుకు ఉదయం చలిమంటలు వేసుకుంటున్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



షాద్‌నగర్ టాన్ : పొగమంచులోనే రాకపోకలు సాగిస్తున్న వాహనాలు




బొంరాస్‌పేట -తుంకిమెట్ల రహదారిపై కప్పేసిన మంచు



బొంరాస్‌పేటలో ఇండ్లపై కమ్ముకున్న మంచు



చేవెళ్లలో కమ్ముకున్న పొగమంచు



చేవెళ్ల నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డులో..





చేవెళ్ల నుంచి షాద్‌నగర్ వెళ్లే రోడ్డులో..

- పోలీసుల ఎంత కఠినంగా వ్యవహరిస్తున్న తగ్గని రోడ్డు ప్రమాదాలు
- ఎడాదికేడాది పెరుగుతున్న పాదచారుల మరణాలు
- గతేడాది 110.. ప్రస్తుతం 121 మంది మృతి

## పెరుగుతున్న
# ప్రమాదాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఎన్ని చేసినా రోడ్డు ప్రమాదాలు తగ్గడంలేదు. పోలీసులు ఎంత కఠినంగా వ్యవహరించినా వాహనదారుల్లో ఆశించిన మార్పు రావడం లేదు. దీంతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయే తప్ప.. తగ్గడంలేదు. అందులోనూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో పాదచారులే అధిక సంఖ్యలో మృతి చెందుతున్నారు. ప్రమాదాల నుంచి పాదచారులను తప్పించేందుకు 31 చోట్ల పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా.. గతేడాది కంటే ఈ సంవత్సరం మృతు ల సంఖ్య ఎక్కువగానే ఉంది. డ్రంక్‌అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్‌ను త గ్గించడం, నిర్లక్ష్యం డ్రైవింగ్‌పై పోలీసులు కొరఢా ఝులిపిస్తున్నారు. 2023లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 121మంది పాదచారులు మృతి చెందారు. 2022లో ఈసంఖ్య 110గా ఉంది.మృతిచెందిన పాదచారుల్లో ఎక్కువ సంఖ్యలో వృద్ధులు, యాచకులే ఉన్నారు. ఆ తర్వాత ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారి సంఖ్య కూడా ఉంది. హైదరాబాద్‌లో ప్రతి సంవత్సరం వేలాది కొత్త వాహనాలు రోడ్డుపైకి వస్తున్నాయి. 2014లో 42 లక్షల వాహనాలు ఉండగా.. 2023లో 83 లక్షలకు పెరిగాయి. పెరుగుతున్న వాహనాల సంఖ్యతో ఎలాంటి ఇబ్బందులు రాకుండా.. రోడ్డు ప్రమాదాలకు తావులేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రమాదాలకు కారణమైన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఈ ఏడాది 37,866 కేసులు నమోదు చేశారు. ఇదిలాఉండగా.. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో భాగంగా రాగ్ (రోడ్డు యాక్సిడెంట్ అనాలసిస్ గ్రూప్) ను ఏర్పాటు చేసి, ప్రమాదానికి కారణాలను విశ్లేషించి తెలుసుకుంటున్నారు. సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. నగర వ్యాప్తంగా 65 చోట్లను ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని సీనియర్ పోలీసు అధికారులు చెబుతున్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు.

| పాదచారులు | మృతుల సంఖ్య |
|---|---|
| 60 ఏండ్లకు పైబడిన వారు | 23 |
| యాచకులు | 23 |
| వాకర్స్ | 18 |
| విజిటర్స్ | 3 |
| ఇతరులు | 54 |

| కేసుల నమోదు | సంఖ్య |
|---|---|
| 2022 | 46,42,357 |
| 2023 | 47,25,089 |

### ఎన్‌ఫోర్స్‌మెంట్ శాతం పెరిగినా..!

ట్రాఫిక్ సాఫీగా వెళ్లే విధంగా చేస్తూ వాహనదారులు పక్కాగా నిబంధనలు పాటించే విధంగా అవగాహన తేవడం, నిబంధనలు అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేస్తూ ట్రాఫిక్ పోలీసులు పలు చర్యలు తీసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు అర్ధరాత్రి తరువాత ఎక్కువగా జరుగుతున్నాయి.

దీంతో అర్ధరాత్రి సమయంలో అతివేగం, నిర్లక్ష్యం డ్రైవింగ్‌పై పోలీసులు ఫోకస్ పెట్టారు. అతివేగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో 2023లో అర్ధరాత్రి తరువాత 1,11,736 కేసులు నమోదు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ 2022తో పోలిస్తే, 2023లో 7 శాతం పెరిగింది.

